క్లుప్తంగా

ఇన్‌చార్జి ఎంపీడీవోగా నసీరొద్దీన్

తానూరు: మండల ఇన్‌చార్జి ఎంపీడీవోగా నసీరొద్దీన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసే ఎంపీడీవో అబ్దుల్ సమ్మద్ శుక్రవారం ఉద్యోగ విరమణ పొందడంతో ఎంపీవోగా విధులు నిర్వహిస్తున్న నసీరొద్దీన్.. ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అబ్దుల్ సమద్, నసీరొద్దీన్‌ను పంచాయతీ కార్యదర్శులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మ్యూజిక్ ప్లేయర్ విరాళం



మ్యూజిక్ ప్లేయర్ అందిస్తున్న ఉపాధ్యాయుడు

కుంటాల: మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో పని చేసే ఉపాధ్యాయుడు సగ్గం గంగాధర్ శుక్రవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా సదరు ఉపాధ్యాయుడు పాఠశాలకు రూ.15 వేల విలువైన మ్యూజిక్ ప్లేయర్‌ను విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం చంద్ర నాగకాంత్, ఉపాధ్యాయులు లక్ష్మణ్, ధర్మాజీ, భోజన్న, లక్ష్మి, చిన్నారెడ్డి, సాహెబ్‌రావు, మారుతి, భూమన్న పాల్గొన్నారు.

సౌకర్యాలు కల్పించాలి

ఖానాపూర్: ముస్లింల పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకుని పట్టణ పరిధిలోని కాలనీల్లో సౌకర్యాలు కల్పించాలని కోరుతూ యంగ్‌స్టార్ యూత్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. రంజాన్ మాసం సందర్భంగా నెలరోజుల పాటు ప్రత్యేక ప్రార్థనలు, ఉపవాసాలను దృష్టిలో ఉంచుకుని కాలనీల్లో వీధిదీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. పారిశుధ్య పనులు చేయించి తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు షకీల్ తదితరులు ఉన్నారు.

'సమాజ్ విభూషణ్' అందుకున్న ముధోల్ వాసి



అవార్డును అందుకుంటున్న సుభాష్

ముధోల్: మండల కేంద్రానికి చెందిన గడ్డం సుభాశ్ శుక్రవారం మహారాష్ట్రలోని భోకర్ తాలూకాలో జరిగిన సాహిత్య సమ్మేళన్ సభలో సమాజ్ విభూషణ్ అవార్డు అందుకున్నారు. సుభాశ్ సేవలను గుర్తించిన మహారాష్ట్ర ప్రభుత్వం ఆయనకు సమాజ్ భూషణ్ అవార్డును నాయకులు గిరీశ్ దేశ్‌ముఖ్ చేతుల మీదుగా అందించి సన్మానించారు.

శుద్ధజల యంత్రం అందజేత



యంత్రం అందిస్తున్న ఉపాధ్యాయుడు షరీన్

దస్తురాబాద్: మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాలకు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వర్తించే ఉపాధ్యాయుడు షరీన్ శుక్రవారం నీటి శుద్ధజల యంత్రం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలో చదివే విద్యార్థులకు సురక్షిత నీటిని అందించేందుకు ఈ యంత్రం అందించినట్లు పేర్కొన్నారు. హెచ్ఎం కోట వేణు, ఉపాధ్యాయులు కొమురయ్య, వెన్నెల, జ్యోతి, లావణ్య తదితరులు ఉన్నారు.

ఆపదలో చిన్నారికి రక్తకణాల దానం



దానం చేస్తున్న సాయిరెడ్డి

భైంసాటౌన్: పట్టణంలోని ఆరుష్ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అశ్విని అనే మూడేళ్ల చిన్నారికి అత్యవసరంగా ఓ పాజిటివ్ రక్తకణాలు అవసరం కాగా కుటుంబసభ్యులు బ్లడ్ డోనర్స్ టీంను సంప్రదించారు. బ్లడ్ డోనర్ గ్రూప్ సభ్యుడు సురేశ్ వెంటనే స్పందించి బ్లడ్ డోనర్ వాట్సాప్ గ్రూప్‌లో పోస్ట్ చేశారు. ఈవిషయం తెలుసుకున్న బోరిగాంకు చెందిన సాయిరెడ్డి వెంటనే ఆసుపత్రికి వెళ్లి రక్తకణాలు దానం చేశారు. దీంతో చిన్నారి తల్లిదండ్రులతోపాటు పలువురు ఆయనను అవార్డుతో అభినందించారు. ఇప్పటివరకు 15 సార్లు రక్తదానం చేసినట్లు సాయిరెడ్డి పేర్కొన్నారు.


ప్రారంభించి వదిలేశారు..

- అసంపూర్తిగా అనంతపేట-తిర్పల్లి రోడ్డు
- అటవీశాఖ అనుమతి రాక నిలిచిన పనులు
- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న ఆయా గ్రామాల ప్రజలు

మామడ: అటవీశాఖ అనుమతులు ఇవ్వకపోవడంతో అనంతపేట-తిర్పల్లి బీటీ రోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోయాయి. మామడ మండలంలోని అనంతపేట గ్రామం నుంచి లక్ష్మణచాంద మండలం తిర్పల్లి గ్రామం వరకు 5.7 కిలోమీటర్ల మేర నిర్మించే బీటీ రోడ్డుకు రూ.2.50కోట్లు మంజూరయ్యాయి. పనులు చేపట్టిన కాంట్రాక్టర్ కంకర పోసి వదిలేయడంతో రాకపోకలు సాగించేందుకు ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

రెండు మండలాలను కలిపే రోడ్డు..

మామడ మండలంలోని పొన్కల్, అనంతపేట్, పోతారం గ్రామాలు.. లక్ష్మణచాంద మండలకేంద్రంతోపాటు తిర్పెల్లి గ్రామాలను కలుపుతూ 20 ఏళ్ల కిందట రోడ్డు నిర్మించారు. ఈ మార్గంలో ఎక్కువ వాహనాలు తిరగడంతో రోడ్డు పూర్తిగా దెబ్బతింది. దీంతో ఆర్అండ్‌బీ అధికారులు.. నూతన రోడ్డు కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించగా ప్రభుత్వం నిధులు కేటాయించింది. మూడు నెలల కిందట కాంట్రాక్టర్ పనులు ప్రారంభించి రోడ్డుపై కంకర పోశారు. కానీ ఈరోడ్డు అటవీ ప్రాంతం గుండా వెళ్తుండటంతో అటవీశాఖ అనుమతుల తప్పనిసరి. కానీ సదరు అధికారులు అనుమతి ఇవ్వకపోవడంతో పనులు నిలిచిపోయాయి.



అర్ధంతరంగా నిలిచిన అనంతపేట్-తిర్పల్లి రోడ్డు

కంకర పోసి వదిలేశారు..

రోడ్డు నిర్మాణ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్.. తారురోడ్డును తొలగించి కంకర పోసి వదిలివేయడంతో ఈమార్గంలో రాకపోకలు సాగించే వివిధ గ్రామాల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అటవీశాఖ అనుమతులు ఇవ్వకపోవడంతో నిర్మాణం ఆలస్యం అవుతోంది. అటవీ ప్రాంతంలో రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు అటవీశాఖ అనుమతి కోసం దరఖాస్తు చేసుకుంటే తప్పనిసరిగా వస్తుందని దిమ్మదుర్తి ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

మామడ మండలంలోని అనంతపేట్ నుంచి లక్ష్మణచాంద మండలంలోని తిర్పెల్లి వరకు నిర్మించే రోడ్డుకు నిధులు మంజూరయ్యాయి. కానీ అటవీశాఖ అనుమతులు రాని కారణంగా పనులు ఆలస్యం అవుతున్నాయి. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తాం.

– భీంసింగ్, ఆర్అండ్‌బీ డీఈ

నిర్మాణం పూర్తిచేయాలి



పనులు ప్రారంభించి నిలిపివేశారు. ఈ మార్గంలో కంకర పోయడంతో రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడుతున్నాం. అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలి.

– మోహన్‌రెడ్డి, తిర్పల్లి

ఉల్లాసంగా.. ఉత్సాహంగా



కల్లూర్‌లో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కుంటాల: మండలంలోని కల్లూరు కేజీబీవీలో శుక్రవారం పదోతరగతి విద్యార్థినులకు వీడ్కోలు వేడుకలు నిర్వహించారు. విద్యార్థినుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు ఇష్టంగా చదివితే ఉన్నత శిఖరాలు చేరుకుంటారని ఇన్‌చార్జి ఎస్ఓ సంధ్యారాణి పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



రాచాపూర్‌లో నృత్యం చేస్తున్న విద్యార్థులు

లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్ గ్రామంలోని మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల బాలుర పాఠశాలలో వార్షికోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాజు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో దర్జీల దినోత్సవం

కుంటాల: మండలంలోని కల్లూరు గ్రామంలో శుక్రవారం దర్జీల దినోత్సవం నిర్వహించారు. రెడిమేడ్ దుస్తుల రాకతో తమకు నష్టం కలుగుతుందని మేరు సంఘ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. సంఘ సభ్యులు పాల్గొన్నారు.

లోకేశ్వరం: మండలకేంద్రంలోని మేరు సంఘ భవనంలో టైలర్స్ డే(దర్జీల దినోత్సవం) నిర్వహించారు. మండలంలోని దర్జీలకు మేరు కులసంఘం ఆధ్వర్యంలో కత్తెర, టేపులను అందజేశారు. మండలాధ్యక్షుడు వెన్నుశివ, సభ్యులు గంగాధర్, సాయన్న, వినోద్, శివరాం, రాజు, సాయినాథ్, రమేశ్, నారాయణ, ముత్యం, మల్లేశ్, భోజారాం ఉన్నారు.



కల్లూరులో మాట్లాడుతున్న మేరు సంఘం సభ్యులు

ప్రజల రక్షణ కోసమే కార్డన్‌సెర్చ్

- నిర్మల్ ఏఎస్పీ రాజేశ్‌మీనా
- పత్రాల్లేని 40 వాహనాలు పట్టివేత

దస్తురాబాద్: ప్రజల రక్షణ కోసమే గ్రామాల్లో కమ్యూనిటీ కాంటాక్ట్ (కార్డన్‌సెర్చ్) నిర్వహిస్తున్నట్లు నిర్మల్ ఏఎస్పీ రాజేశ్‌మీనా అన్నారు. శుక్రవారం మండలంలోని దేవునిగూడెం గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా అన్ని పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. సైబర్ నేరాలు పెరుగుతున్నందుకు ఫోన్‌కు వచ్చే ఓటీపీలు అపరిచితులకు చెప్పవద్దన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరం ఉండాలని పేర్కొన్నారు. అనంతరం ధ్రువపత్రాల్లేని 40 బైక్‌లకు జరిమానాలు విధించారు. అనంతరం రెండు ఆటోలు, నెంబర్ ప్లేట్ లేని మూడు బైక్‌లను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో ఖానాపూర్ సీఐ సైదారావు, కడెం, ఖానాపూర్, పెంబి ఎస్సైలు శంకర్, రాహుల్, కృష్ణసాగర్‌రెడ్డి, హనుమంతు ఏఎస్సైలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఎస్పీ రాజేశ్ మీనా

ఎన్నికల హామీలు వెంటనే అమలు చేయాలి

ఖానాపూర్: ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శులు పీటర్, సురేందర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యం కారణంగానే ప్రజలు గద్దె దించిన విషయాన్ని గుర్తు చేసుకోవాలని సూచించారు. నర్సయ్య, హైమద్‌ఖాన్ తదితరులు ఉన్నారు.

దొంగలు బాబోయ్..దొంగలు

- తానూరు మండలంలో వరుస దొంగతనాలు
- వారం రోజుల్లోనే నాలుగు ఘటనలు
- చోద్యం చూస్తున్న పోలీసులు
- భయాందోళనలో ప్రజలు

తానూరు: సరిహద్దు ప్రాంతమైన తానూరు మండలంలోని పలు గ్రామాల్లో వరుస దొంగతనాలు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. వారం రోజుల్లోనే నాలుగు వరుస దొంగతనాలు జరిగాయి. ఎప్పుడేం జరుగుతుందోనని ప్రజలను భయాందోళన చెందుతున్నారు. పోలీసులు పెట్రోలింగ్ చేపట్టి.. దొంగతనాలను అరికట్టాలని కోరుతున్నారు. ఇటీవల మండలంలోని బోంద్రట్ గ్రామంలో వ్యవసాయ పనులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న ఓ మహిళ మెడలో నుంచి రెండున్నర తులాల బంగారు పుస్తెలతాడును గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. అదే రోజు రాత్రి బోసి గ్రామంలో ఓ ఇంట్లో చొరబడి నగదు రూ.56 వేలు దోచుకెళ్లారు. ఎల్వి గ్రామంలో మధ్యాహ్నం ఓ ఇంట్లో ఉన్న దివ్యాంగుడైన యువకుడికి మత్తు చల్లి ఇంట్లో ఉన్న రూ.40 వేల నగదు, మూడున్నర తులాల బంగారం దొంగిలించినట్లు కుటుంబీకులు తెలిపారు. వారం రోజుల క్రితం ఉమ్రి(కే) గ్రామంలో రామ్ అనే రైతు ఎడ్లను అపహరించేందుకు యత్నించగా తోటి రైతులు దొంగను పట్టుకుని పోలీసులకు అప్పగించారు.



పొలాలకు వెళ్లాలన్నా భయమే..

ఇటీవల జరుగుతున్న దొంగతనాల గురించి ప్రజలు మండలవ్యాప్తంగా చర్చించుకుంటున్నారు. మహిళలు పంట పొలాలకు వెళ్లేందుకు జంకుతున్నారు. ఎప్పుడు ఎటువైపు నుంచి దొంగలు వచ్చి దాడి చేసి మెడలో ఉన్న బంగారం ఎత్తుకెళ్తారో తెలియని పరిస్థితి నెలకొంది. పొలాల్లో మగవాళ్లు కాపలా ఉంటేనే కూలీ పనులకు వస్తామని మహిళా కూలీలు పేర్కొంటున్నారు. పోలీసులు గ్రామాల్లో తనిఖీలు ముమ్మరం చేస్తూ దొంగతనాలను అరికట్టేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

తానూరు మండలంలో వరుస దొంగతనాలు జరిగిన మాట వాస్తవమే. సరిహద్దు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. మహిళలు నగలు ధరించి ఒంటరిగా కాకుండా ఇద్దరు, ముగ్గురు కలిసి వ్యవసాయ పనులకు వెళ్లేలా చూసుకోవాలి. బంధువుల ఇళ్లకు వెళ్లినప్పుడు పక్క ఇంటివారికి సమాచారం ఇవ్వాలి. అలారం లాక్ ఏర్పాటు చేసుకుంటే మంచిది. గ్రామంలో వీడీసీ ద్వారా, దుకాణాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. అనుమానితులు కన్పిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.. దొంగతనాలపై కేసు నమోదు విషయమై దర్యాప్తు ప్రారంభించాం. – మల్లేశ్, ముధోల్ సీఐ

జాతీయ సైన్స్ దినోత్సవం



బాసరలో ప్రయోగం పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు



ఖానాపూర్ జెడ్పీ హెచ్ఎస్ పాఠశాలలో మూలకాలు చెబుతున్న విద్యార్థిని సహస్ర



భైంసాటౌన్ : గుజిరిగల్లి శిశుమందిర్ పాఠశాలలో సీవీ రామన్ చిత్రపటం వద్ద విద్యార్థులు

నిర్మల్‌రూరల్: జిల్లావ్యాప్తంగా అన్నిపాఠశాలల్లో శుక్రవారం జాతీయ సైన్సు దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాలల్లో విద్యార్థులు సైన్స్ ప్రయోగాలను ప్రదర్శించారు. సైన్స్ ఉపాధ్యాయులను విద్యార్థులు, తోటి ఉపాధ్యాయులు సన్మానించారు. మంజులాపూర్‌లో ప్రధానోపాధ్యాయులు సిద్ధ పద్మ రామన్ ఎఫెక్ట్ గురించి విద్యార్థులకు వివరించారు.

బాసర: మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో సైన్సు దినోత్సవం నిర్వహించారు. తాము తయారు చేసిన చంద్రయాన్–3, వాటర్ ప్యూరిఫికేషన్ తదితర ప్రాజెక్టులను విద్యార్థులు, పోలీసులకు, తల్లిదండ్రులకు వివరించారు. హెచ్ఎంలు నర్సయ్య, శ్రీరాములు ,ఎస్టీయూ మండల ప్రధాన కార్యదర్శి నరేందర్‌రావు, ఉపాధ్యాయులు మమత, అరుంధతి, రఘు తదితరులున్నారు. కిర్గుల్(బి) జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్సు ఫెయిర్‌లో హెచ్ఎం నర్సారెడ్డి, ఉపాధ్యాయులు బి.నరేశ్, ఎస్.నరేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు ప్రదర్శనలు చేశారు. బాసర నాగభూషణం విద్యాలయంలో ప్రాజెక్ట్ వర్క్‌ను తయారు చేసి ప్రదర్శించారు. హెచ్ఎం బాబురావు పటేల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఖానాపూర్: విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవర్చుకొని చదువులో రాణించాలని ఎంపీడీవో సునీత అన్నారు. మండలంలోని మస్కాపూర్ జెడ్పీహెచ్ఎస్‌లో సైన్స్ దినోత్సవం నిర్వహించారు. అనంతరం ఫుడ్ ఫెస్టివల్‌ను ప్రారంభించారు. హెచ్ఎం నరేందర్‌రావు, వీడీసీ అధ్యక్షుడు అడ్వాల శంకర్, సైన్స్ ఉపాధ్యాయులు శంకర్, శేఖర్ పాల్గొన్నారు.

సోన్: మండలంలోని సిద్దులకుంట జెడ్పీ ఉన్నత పాఠశాల, కడ్తాల్ ప్రాథమిక పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శనలను ఎంఈఓ పరమేశ్వర్ తిలకించారు. పరమేశ్వర్ రచించిన వైజ్ఞానిక సౌరభాల పుస్తకాన్ని విద్యార్థులకు అందించారు. సిద్దులకుంట పాఠశాలలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించామని హెచ్ఎం హరీశ్‌రెడ్డి తెలిపారు. కడ్తాల్ పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం రమేశ్‌బాబు పాల్గొన్నారు.

భైంసారూరల్: మండలంలోని మహాగాం గ్రామ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు తయారు చేసిన పలు చిత్రాలను ప్రదర్శించారు. సైన్స్‌డే ప్రాముఖ్యతను ఉపాధ్యాయులు నంగి కృష్ణ వివరించారు.

లోకేశ్వరం: మండలకేంద్రంలో కేజీబీవీతోపాటు మన్మద్ జెడ్పీ పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ అనసూయ, ఉపాధ్యాయులు దేవేందర్, గంగాధర్ మల్కాగౌడ్ ఉన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని పీచర జెడ్పీ ఉన్నత పాఠశాలలో సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు సాయికృష్ణ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఖానాపూర్: పట్టణంలోని బాలికల జెడ్పీహెచ్ఎస్‌లో సైన్స్ దినోత్సవం నిర్వహించారు. తొమ్మిదో తరగతి విద్యార్థిని సహస్ర 108 మూలకాలు చెప్పి అబ్బురపరిచింది. పలువురు విద్యార్థుల ప్రయోగాలు ఆకట్టుకున్నాయి. హెచ్ఎం సంధ్యారాణి, సైన్స్ టీచర్లు సుష్మారాణి, స్రవంతి పాల్గొన్నారు.

భైంసాటౌన్: పట్టణంలోని జీఆర్‌పీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైన్స్ దినోత్సవం గురించి వివరించారు. గుజిరిగల్లి శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో సీవీ రామన్ చిత్రపటానికి నివాళులర్పించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మామడ: పాఠశాలల్లో సీవీ రామన్ చిత్రపటానికి నివాళులర్పించారు. విద్యార్థులకు క్విజ్, ఉపన్యాస, వ్యాసరచన, పాటల పోటీలు ఏర్పాటు చేసి విజేతలకు బహుమతులు అందించారు. పొన్కల్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం అరవింద్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సారంగపూర్: మండల కేంద్రంలోని వివేకానంద ఉన్నత పాఠశాలలో విద్యార్థులు సైన్స్ ఆవిష్కరణలను ప్రదర్శించారు. ప్రతిభ కనబరిచినవారికి బహుమతులు అందజేశారు. కరస్పాండెంట్ సముద్రాల గీత, ప్రిన్సిపాల్ విమల, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

తానూరు: మండలంలోని ఎల్వి జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులు సైన్సు ప్రయోగాలను ప్రదర్శించారు. సైన్స్ ఉపాధ్యాయులు మాధవ్‌రావ్, సుదర్శన్‌లను సన్మానించారు. వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఎంఈవో నరేందర్, ఉపాధ్యాయులు శంకర్, భూమన్నయాదవ్, శిరీష్‌కుమార్, రజనీకాంత్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కడెం: మండలంలోని లింగాపూర్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ప్రదర్శనతోపాటు విద్యార్థులకు క్విజ్, డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. ప్రతిభ కనబరచిన వారికి బహుమతులు అందించారు. సైన్స్ ఉపాధ్యాయులు ఎస్.బాలాజీ, ఎస్.శ్రీదేవి, కిషన్, విశ్వనాథరెడ్డి, కె.మహేశ్‌ను సన్మానించారు.

కుంటాల: మండలంలోని కల్లూరు గ్రామ వాసవి హైస్కూల్‌లో విద్యార్థులు సైన్స్ నమూనాలను ప్రదర్శించారు. వాసవి విద్యాసంస్థల కరస్పాండెంట్ బోయిలు సాయిలు, ప్రిన్సిపాల్ గట్టుపల్లి శ్రీనివాస్, డి.సంతోష్, కార్యదర్శులు జానకీరాం, హరిప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని విజయ ఉన్నత పాఠశాలలో నేషనల్ సైన్స్ డే నిర్వహించారు. ఈసందర్భంగా సీవీ రామన్ చిత్రపటానికి నివాళులర్పించారు. కరస్పాండెంట్ మంచిరాల నాగభూషణం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముధోల్: మండలకేంద్రంలోని రబీంద్ర పాఠశాల, శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాలల్లో విద్యార్థులు చేసిన సైన్స్ ప్రయోగాలు ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కడెం: లింగాపూర్‌లో తిలకిస్తున్న హెచ్ఎం



తానూరు : ఎల్వి పాఠశాలలో..



కడ్తాల్ ప్రాథమిక పాఠశాలలో వైజ్ఞానిక పరికరాలతో ఉపాధ్యాయులు



నిర్మల్‌రూరల్: మంజులాపూర్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయులకు సన్మానం



భైంసారూరల్ : మహాగాం పాఠశాలలో..



లోకేశ్వరం కేజీబీవీలో..



లక్ష్మణచాంద : పీచర పాఠశాలలో..

మొక్కలను కాపాడాలి

లోకేశ్వరం: నర్సరీలో పెంచుతున్న మొక్కలకు నీటిని అందించి కాపాడాలని ఎంపీడీవో వెంకటరమేశ్ అన్నారు. శుక్రవారం మండలంలోని మన్మద్, పోట్‌పల్లి గ్రామాల్లో ఎంపీడీవో పర్యటించారు. నర్సరీలు, సెగ్రిగేషన్ షెడ్లు, పల్లె ప్రకృతివనాలను పరిశీలించి మాట్లాడారు. రోడ్లను రోజు శుభ్రం చేయిస్తూ.. గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. ఏపీవో జగన్నాథ్, ఈసీ అనిల్, టీఏ శారద ఉన్నారు.

ఉపాధి పనులకు వచ్చేలా చూడాలి

లోకేశ్వరం: జాబ్ కార్డులున్న కూలీలు ఉపాధిహామీ పనులకు వచ్చేలా చూడాలని ఎంపీడీవో వెంకటరమేశ్ అన్నారు. శుక్రవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందికి ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీడీవో మాట్లాడారు. పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పిస్తూ.. కూలీల హాజరు పెరిగేలా చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీవో జగన్నాథ్, ఈసీ అనిల్ ఉన్నారు.



పోట్‌పల్లిలో మొక్కలు పరిశీలిస్తున్న వెంకటరమేశ్

నేడు విద్యుత్ సరఫరా బంద్

భైంసాటౌన్: సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో పట్టణంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని నిర్మల్‌రోడ్, ఓవైసీనగర్, రాజీవ్‌నగర్, మోమినామ్ గల్లి, ఏక్‌మినార్ ఏరియా, మదీనా కాలనీ, పల్సి ఫీడర్, స్పిన్నింగ్ మిల్ ఫీడర్, తిమ్మాపూర్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

సారంగపూర్: మండలకేంద్రంలోని 132/33 కేవి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ సాయికిరణ్ తెలిపారు. జామ్, సారంగాపూర్, కౌట్ల(బి), స్వర్ణ గ్రామాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు.